

ఓటరు అవగాహన కోసం తెచ్చిన డమ్మీ ఈవీఎం యంత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

## ఓటర్లను చైతన్య పర్చాలి

- కలెక్టర్ వెంకట్రావ్

సూర్యాపేట, అక్టోబర్ 27 : సార్వత్రిక ఎన్నికల్లో అర్హులు ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చైతన్య పరుచాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకట్రావ్ అన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లాకు వచ్చిన సెల్ఫీ పాయింట్, డమ్మీ ఈవీఎం, వీవీ ప్యాడ్స్ యంత్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. జిల్లాలోని అన్ని నియోజక వర్గాలకు ఈ సామగ్రిని తరలించి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈఓ అశోక్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ రెండో జాబితాలో మరో ముగ్గురికి చోటు

- మునుగోడులో కృష్ణారెడ్డి, స్రవంతికి హ్యాండ్ ఇచ్చిన అధిష్ఠానం
- ఒక్కరోజులో పార్టీలోకి వచ్చిన రాజగోపాల్ రెడ్డికి టికెట్
- దేవరకొండలోనూ అసంతృప్తిలో రమేశ్‌నాయక్, కిషన్‌నాయక్
- పెండింగ్ లో మరో మూడు సీట్లు

నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 27(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పార్టీ రెండో జాబితాలో ఉమ్మడి జిల్లాలోని మరో మూడు స్థానాలకే అభ్యర్థులను ప్రకటించారు. దీనితో ఇప్పటికే మొత్తం తొమ్మిది స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసినట్లు అయింది. శుక్రవారం ప్రకటించిన జాబితాలో మునుగోడు నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, దేవరకొండ నుంచి నేనావత్ బాలూ నాయక్, భువనగిరి నుంచి కుంభం అనిల్ కుమార్ రెడ్డికి స్థానం లభించింది. మిర్యాలగూడ, సూర్యాపేట, తుంగతుర్తి స్థానాల్లో నేటికీ ఎటూ తేల్చలేకపోయింది. కాగా రెండో జాబితా విషయంలో మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్నది. మునుగోడులో ఆది నుంచి చలమల్ల కృష్ణారెడ్డి టికెట్ ఆశిస్తూ అనేక కార్యక్రమాలు చేపట్టారు. గతేడాది చివర్లో జరిగిన ఉప ఎన్నికల్లోనే టికెట్ కోసం తీవ్రంగా పోటీపడ్డారు. కానీ పార్టీలో అంతర్గత పోరుతో ఆయనకు టికెట్ దక్కలేదు. అప్పట్లో తన తమ్ముడు రాజగోపాల్ రెడ్డి బీజేపీ నుంచి గెలవాలంటే... కాంగ్రెస్ టికెట్ కృష్ణారెడ్డికి ఇవ్వొద్దని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అడ్డుపడ్డారు. దీంతో స్రవంతికి టికెట్ కేటాయించారు. ఇక ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఘోర పరాభవం ఎదురుకావడంతో అనంతరం చలమల కృష్ణారెడ్డి యాక్టీవ్ అయ్యారు. ప్రస్తుత ఎన్నికల్లో టికెట్ గ్యారంటీ అని రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీతో ఇప్పటికే చాలా డబ్బు ఖర్చు చేసి తిరిగి పార్టీని నిలబెట్టే ప్రయత్నం చేశాడు. రేవంత్‌రెడ్డి హామీతో చివరి నిమిషం వరకు తనకే టికెట్ అన్న భరోసాతో ఉన్న కృష్ణారెడ్డికి రెండో జాబితాతో ఝలక్ ఇచ్చినట్లు అయింది. దీంతో కృష్ణారెడ్డితో పాటు ఆయన అనుచరులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నట్లు తెలిసింది. కష్టకాలంలో పార్టీని వదిలేసి తన వ్యాపార ప్రయోజనాల కోసం బీజేపీలో చేరి ద్రోహం చేసిన రాజగోపాల్‌రెడ్డికి తిరిగి టికెట్ ఇవ్వడం ఏంటన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. పార్టీని, పార్టీ పెద్దలను అడ్డగోలుగా తిట్టినా రాజగోపాల్ రెడ్డికి ఎలా టికెట్ ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. పాల్వాయి స్రవంతి, పున్న కైలాష్ నేతలు సైతం తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తుంది. ఇక దేవరకొండ టికెట్ ఆశించిన వడ్త్యా రమేశ్‌నాయక్, నేనావత్ కిషన్‌లాల్‌నాయక్ కూడా అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. ఇక్కడ బాలూనాయక్ మధ్యలో వేరే పార్టీకి వెళ్లడంతో వీరు పార్టీని నిలబెట్టే ప్రయత్నం చేశారు. ప్రస్తుతం టికెట్ బాలూనాయక్‌కు ఇవ్వడంతో వీరు ఏ మేరకు సహకరిస్తారు అనేది తెలాల్సి ఉన్నది. ఇక భువనగిరి లోనూ కుంభం అనిల్ కుమార్ కు టికెట్ రావడంతో బీసీ నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. టికెట్ ఆశించిన రామాంజనేయులుగౌడ్ లాంటి వాళ్లు ఏమీ చేస్తారో వేచి చూడాలి. ఇక సూర్యాపేటలో మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి, పటేల్ రమేశ్‌రెడ్డి మధ్య టికెట్ కోసం హోరాహోరీ నెలకొంది. తుంగతుర్తిలోనూ అద్దంకి దయాకర్ పోటీ చేస్తాడా లేదా ఇతరులకు టికెట్ ఇస్తారా అనేది స్పష్టం కాలేదని తెలిసింది. ఇక మిర్యాలగూడను పొత్తులో భాగంగా సీపీఎంకు కేటాయిస్తారన్న చర్చ ఉన్నది. సీపీఎంతో పొత్తు తేలకపోవడంతోనే ఇది పెండింగ్‌లో పెట్టినట్లు సమాచారం. మిర్యాలగూడను సీపీఎంకు కేటాయిస్తే ఇక్కడ టికెట్ ఆశిస్తున్న బత్తుల లక్ష్మారెడ్డి ఏమీ చేస్తాడు అనేది కూడా ఆ పార్టీలో చర్చనీయాంశంగా మారింది.

## 29న మలిదశ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం

హుజూర్‌నగర్, అక్టోబర్ 27 : ఈ 29న హుజూర్‌నగర్ పట్టణంలోని శ్రీలక్ష్మి ఫంక్షన్ హాల్ నిర్వహించనున్న తెలంగాణ మలిదశ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని మలిదశ ఉద్యమకారులు దొడ్డ నర్సింహారావు, అజయ్, నగేశ్ రాథోడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న మలిదశ ఉద్యమకారులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే సైదిరెడ్డి విజయం కోసం అనుసరించాల్సి వ్యూహాలపై చర్చించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మలిదశ ఉద్యమకారులు పానుగంటి వెంకన్న, శీలం వీరయ్య, జానీపాషా, లతీఫ్, నారాయణ, సందీప్, వెంకన్న, మెండె లక్ష్మీనర్సు, మల్లారెడ్డి, ఉపేందర్, మంగమ్మ, సాయి పాల్గొన్నారు.



చింతలపాలెం : సమావేశంలో మాట్లాడుతున్న మలిదశ ఉద్యమకారుడు నగేశ్‌రాథోడ్

మేళ్లచెర్వు : హుజూర్‌నగర్‌లో ఈ నెల 29 న జరిగే తెలంగాణ మలిదశ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు హరి లక్ష్మణ్‌కుమార్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమకారులు చేయిచేయి కలిపి ఎమ్మెల్యేగా సైదిరెడ్డిని తిరిగి గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పూర్ణచందర్‌రావు, కృష్ణ, నగేశ్‌రాథోడ్, నరసింహారావు, శ్రీనివాసాచారి, సీతారామయ్య, అన్వర్, నారాయణ, ఫణీంద్ర పాల్గొన్నారు.

చింతలపాలెం : హుజూర్‌నగర్‌లో ఈ 29న జరిగే తెలంగాణ మలిదశ ఉద్యమకారుల ఐక్యవేదిక సభను విజయవంతం చేయాలని మలిదశ ఉద్యమకారుడు నగేశ్ రాథోడ్ అన్నారు. మండల కేంద్రంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారుల ఐక్యవేదిక సన్నాహక సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారులు వేములూరి రంగాచారి, దొడ్డ నర్సింహారావు, రాజు, అజయ్, గులాం హుస్సేన్, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, మతీన్, సోమయ్య పాల్గొన్నారు.

## సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలి

- బీఆర్ఎస్ మైనార్టీ జిల్లా నాయకుడు ఖలీల్ అహ్మద్

నడిగూడెం, అక్టోబర్ 27 : కోదాడలో ఈ నెల 29న జరిగే సీఎం కేసీఆర్ బహిరంగ సభకు ముస్లిం మైనారిటీలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మైనారిటీ జిల్లా నాయకుడు ఖలీల్ అహ్మద్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన మైనారిటీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పాలకులు ముస్లింలను ఓటు బ్యాంక్‌గా మాత్రమే చూశారన్నారు. మైనారిటీల కోసం అనేక పథకాలను ప్రవేశ పెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని కొనియాడారు. కార్యక్రమంలో జలీల్, గౌస్, బుడే, గౌస్‌మియా, జానీ పాల్గొన్నారు.

మునగాల : కోదాడలో నిర్వహించే సీఎం కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తొగరు రమేశ్ అన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో సీఎం సభను విజయవంతం చేయాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించి సీఎం కేసీఆర్‌కు కానుకగా అందించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అజయ్‌కుమార్, కందిబండ సత్యనారాయణ పాల్గొన్నారు.

నడిగూడెం : కోదాడలో జరుగనున్న సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలని ఎంపీపీ యాతాకుల జ్యోతిమధుబాబు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. బీఆర్ఎస్‌తోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## త్రైకాండోో విజేతలకు అభినందన

రామగిరి, అక్టోబర్ 27: నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో శుక్రవారం నిర్వహించిన త్రైకాండో పోటీల్లో స్వర్ణపతకాలు సాధించిన నల్లగొండ మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థినులు సరయూ, మేఘనను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఘన్‌శ్యాం శుక్రవారం అభినందించారు. ఎంజీయూ మహిళా టీమ్ ఎంపిక కావడంతో పాటు నవంబర్‌లో జరిగే జాతీయ స్థాయి వెస్ట్ జోన్ పోటీలకు వెళ్లడం గర్వంగా ఉందని ఆయన పేర్కొన్నారు.



బీమా చెక్కును అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## బీమా చెక్కు అందజేత

నేరేడుచర్ల, అక్టోబర్ 27 : మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డులో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన సయ్యద్ బాబుకు మంజూరైన ప్రమాద బీమా చెక్కు రూ.2 లక్షలను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ జయబాబు బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకునేది బీఆర్ఎస్ పార్టీ అన్నారు. కౌన్సిలర్ షేక్ బాషా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ రమేశ్, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, వీరయ్య, బీఆర్ఎస్ నాయకులు సైదిరెడ్డి, వీరయ్య, శ్రీను, రాజేశ్, సామేలు, ఖాసీం, కృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దయాకర్‌రెడ్డి

## సమష్టి కృషితోనే డీసీసీబీ లాభాల్లోకి..

నల్లగొండ, అక్టోబర్ 27:పాలక వర్గంతో పాటు ఉద్యోగులు చేసిన సమష్టి కృషి మూలంగానే డీసీసీబీ లాభాల్లోకి వచ్చినట్లు వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్ రెడ్డి అన్నారు. డీసీసీబీలో శుక్రవారం జరిగిన మహాజన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా పంట రుణాలు ఇవ్వడంతో పాటు కమర్షియల్ రుణాలు ఇవ్వడం వల్లనే మంచి లాభాలు సాధిస్తున్నామన్నారు. రైతులు, ఖాతాలకు మెరుగైన రుణాలు ఇవ్వడంతో పాటు విద్యారుణాలు, వ్యక్తి గత, బిజినెస్, మార్టిగేజ్ రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సీఈఓ మదన్ మోహన్, డైరెక్టర్లు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కమాండెంట్ సత్యశ్రీనివాస్

## 12వ బెటాలియన్‌లో ఓపెన్ హౌస్

నీలగిరి, అక్టోబర్ 27. పోలీసుల అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం అన్నెపర్తిలోని 12వ బెటాలియన్‌లో కమాండెంట్ ఎన్వీ సత్యశ్రీనివాస్ ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు పోలీసులు విధి నిర్వహణలో ఉపయోగించే ఆయుధాలను వివరించారు. పోలీసులు విధి నిర్వహణలో ఎదుర్కొనే ఒత్తిడి వారి కుటుంబాల మీద ఎలాంటి ప్రభావం చూపుతుందో ఈసందర్భంగా కమాండెంట్ విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు ఒత్తిడి ఎలా ఎదుర్కోవాలో సైకాలజిస్టు డాక్టర్ గంగాధర్ బారెడ్డి వివరించారు. కార్యక్రమంలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ బి.చంద్రశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.

## భద్రతా ఏర్పాట్లను సమర్థవంతంగా చేపట్టాలి

- రాచకొండ జాయింట్ సీపీ తరుణ్ జోషి, కలెక్టర్ హనుమంత్ కే జెండగే

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 27 : ఎన్నికల నేపథ్యంలో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లు సమర్థవంతంగా చేపట్టాలని రాచకొండ జాయింట్ సీపీ తరుణ్ జోషి, కలెక్టర్ హనుమంత్ కె.జెండగే సూచించారు. శుక్రవారం భువనగిరిలోని అరోరా ఇంజినీరింగ్ కళాశాల, ఆలేరు ఇండోర్ స్టేడియాలను ఆయన సందర్శించి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ సెంటర్ల ఏర్పాటు కోసం భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ పోలీస్ కమిషనర్ రాజేశ్‌చంద్ర, అదనపు కలెక్టర్లు జి.వీరారెడ్డి, ఎ.భాస్కర్‌రావు, అడిషనల్ డీసీపీ రవికుమార్, భువనగిరి ఆర్డీఓ అమరేందర్, భువనగిరి ఏసీపీ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



అరోరా ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాచకొండ పోలీస్ జాయింట్ కమిషనర్ తరుణ్ జోషి, కలెక్టర్ హనుమంత్ కె.జెండగే